

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 14, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 13732 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74037 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.040 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# గూగుల్ రాకతో ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తోంది

- అభివృద్ధి వికేంద్రీకరణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- నాడు హైదరాబాద్, నేడు విశాఖ అభివృద్ధి సీఎం చంద్రబాబుకే సాధ్యం
- డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** ప్రపంచ స్థాయి సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తూ అభివృద్ధి వికేంద్రీకరణను చేతల్లో చూపిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా 1.33 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర అభివృద్ధిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి తీసుకువచ్చిన సీఎం చంద్రబాబుకి, మంత్రి నారా లోకేష్‌కి, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సాంకేతిక రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకుంటాయని, సాంకేతికంగా దేశంలో రాష్ట్రం తొలిస్థానంలో నిలుస్తుందన్నారు. ప్రపంచం మొత్తం నేడు సిటీ ఆఫ్ డెస్టినీ గా విశాఖ వైపు చూసేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చొరవ చూపారన్నారు. ప్రపంచంలో అమెరికా తర్వాత అతిపెద్ద, దేశంలోనే తొలి ఏఐ హబ్‌ను గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోతోందన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలు మెరుగుపడతాయన్నారు. ఈ డేటా సెంటర్ అంతర్జాతీయ నెట్వర్క్‌కు కనెక్ట్ చేసి, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత వ్యవస్థలకు గూగుల్ అనుసంధానం చేయనుంది. దీంతో అంతర్జాతీయ స్థాయిలో విశాఖపట్నం కనెక్టివిటీ కేంద్రంగా మారనుందన్నారు.

## జీఎస్టీ తగ్గింపు సామాన్య ప్రజలకు వరం: ఎమ్మెల్యే




**సైదాపురం, అక్టోబర్ 14, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 పేద, మధ్య తరగతి సామాన్య ప్రజలకు వరం లాంటిదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా మండల కేంద్రమైన సైదాపురం బస్టాండ్ ప్రాంతం నుండి హాస్పిటల్ సెంటర్ వరకు జీఎస్టీ సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ మంగళశారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిధిగా పాల్గొని వ్యాపారులకు, కొనుగోలు దారులకు జీఎస్టీపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం జరిగిందని ఆయన అన్నారు. జీఎస్టీ వల్ల ధరలలో పారదర్శకత పెరిగి వినియోగదారులకు న్యాయమైన ధరలు లభిస్తాయని ఆయన తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు, తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎంపీడీవో ఎంవీ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పెమ్మసాని దిలీప్ చౌదరి, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, సొసైటీ అధ్యక్షులు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, జడ్పీటీసీ సభ్యులు చిత్తలూరి పోలయ్య, మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి, మండల ఉపాధ్యక్షులు నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, సొసైటీ డైరక్టర్ రాఘవరెడ్డి, బీజేపీ నాయకులు చాంద్ ఖాశీం, విజియ్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిపిఒ ఆదేశించినా పంచాయితీ అధికారుల్లో మారనీ తీరు




**చేజర్ల అక్టోబర్ 14 ప్రభాతవార్త** మండలం యనమదల గ్రామ పంచాయితీ అధికారుల పనీతీరుపై పలు విమర్శలు విన వస్తున్నాయి. సాక్షాత్తు జిల్లా పంచాయితీ అధికారి ఆదేశించినప్పటికి ఆ ఆదేశాలను అమలు చేయకపోగా ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేఖంగా పనిచేస్తు కాలం గడుపుతున్నారు. యనమదల పంచాయితీకి సంబందించిన ఆర్‌ప్లాంట్ నిర్వహణ బాద్యతలను బహిరంగ వేలం ద్వారా అర్హులైన వారికి అప్పగించాలని జిల్లా పంచాయితీ అధికారి గతంలో ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. సాక్షాత్తు జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాలను తుంగలో తొక్కుతు వేలం నిర్వహణ సంజసమం కాదని పంచాయితీ పాలక వర్గం తీర్మానం చేసింది. దీనికి స్థానిక పంచాయితీ కార్యదర్శి సైతం మద్దతు పలకడం వితం గొలుపు తుంది. ఒ వైపు ఆర్‌ఒ ప్లాంట్ నిర్వహణను ఇతరులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. పంచాయితీ కార్యదర్శిగాని, మండల అభివృద్ధి అధికారి కాని ఎ ఒక్కరు జిల్లా పంచాయితీ అదేశాలను అమలు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తుంది. ఆర్‌ఒప్లాంట్ ఒక సెట్ తాళాలు మాత్రం పంచాయితీ కార్యదర్శి స్వాధీనం చేసుకోగా మరో సెట్ తాళాలు స్థానిక సర్పంచ్ వద్దనే ఉంచడం గమనర్హం, సర్పంచ్ అరాచకాలు, అక్రమాలపై విచారణ జరిపినా జిల్లా అధికారులు ఆ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికి నేటికి ఆగ్రామ సర్పంచ్ ఆర్‌ఒప్లాంట్ ఆర్ధిక లావాదేవిలు ఆయనే పర్యవేక్షించడం పంచాయితీ అధికారుల నిజాయితీని శంకిస్తుంది. జిల్లా అదికారులు విచారణ జరిపి చెక్ పవర్ రద్దు చేసిన అనంతరం పంచాయితీ కార్యదర్శి ఆర్‌ఒ ప్లాంట్ ఆర్ధిక లావాదేవిలకు సంబందించిన ఏలాంటి సొమ్ము ట్రెజరీలో జమ చేయపోవడం విచార కరం,. ఆర్‌ఒ ప్లాంట్‌కు అందుతున్న రోజు వారి నీటి వినియోగం సొమ్ము తాలూకా జమలు ఏమౌతున్నాయో సమాదానం చెప్పేవారు లేరు. ఈ అంశాలు అన్నింటిని జిల్లా పంచాయితీ అధికారి సమగ్రంగా విచారణ జరిపితే ప్రభుత్వం ఆదాయానికి గండి కొడుతు పంచాయితీ అధికారుల, పంచాయితీ సర్పంచ్ బాగోతం బయట పడుతుంది. ఈ విషయంలో అధికారులు ఏలా స్పందిస్తారో వేచి చూడలి. ఎంపిడిఒ వివరణ చేజర్ల మండల ఎంపిడిఒ అమర్‌ను ప్రభాతవార్త మంగళవారం వివరణ కోరగా ఆయన ఇలా స్పందించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు చేపడతామని ముక్క సరిగా బదులులిచ్చారు.

## ఎంఈఓ, టీచర్ మధ్య వాగ్వాదం



**వింజమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** సమాజంలో గౌరవమైన వృత్తిలో పని చేసే ఒక ఉపాధ్యాయుడు, మండల విద్యాశాఖాధికారి అందరూ చూస్తుండగానే గొడవపడిన సంఘటన మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో చోటు చేసుకుంది. వింజమూరు మండలంకు వివిధ పాఠశాలలకు నూతనంగా విచ్చేసిన 15 మంది ఉపాధ్యాయులు ఎంఈఓ కార్యాలయంకు విచ్చేసి ఎంఈఓ పి.రమేష్, మధుసూదన్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో యూటీఎఫ్ సంస్థకు చెందిన ఉపాధ్యాయ సంఘ నేత చంచల బాబు, ఎంఈఓ కార్యాలయం చేరుకుని ఎంఈఓ నూతనంగా విచ్చేసిన టీచర్లతో ఫొటో దిగి వారితో పరిచయం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మరో ఉపాధ్యాయ సంఘం ఏపీటీఎఫ్ నేత పి.కొండారెడ్డి ఎంఈఓ కార్యాలయం చేరుకుని ఒక ఉపాధ్యాయ సంఘం వారిని పిలిచి తమను ఎందుకు పిలవలేదని ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డితో ఉపాధ్యాయుడు కొండారెడ్డి మాట్లాడుతూ ఉండగా తాము ఎవరిని పిలవలేదని ఎంఈఓ-2ను మధుసూదన్‌రెడ్డితో ఉపాధ్యాయుడు కొండారెడ్డి మాట్లాడుతూ ఉండగా తాము ఎవరిని పిలవలేదని, వాప వచ్చారని ఆయన బదులిచ్చే క్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ రమేష్ కొండారెడ్డిల మధ్య మాట మాట పెరిగింది. అందరూ చూస్తుండగానే వీరిద్దరూ గొడవ పడుతూ ఉంటే కార్యాలయంలోని సిబ్బంది అక్కడికి చేరుకొని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఎంఈఓ-2 తో మాట్లాడుతుంటే ఎంఈఓ-1 రమేష్ తనపై నోరు పారేసుకుని దురుసుగా ప్రవర్తించారని కొండారెడ్డి వాపోయారు. ఎంఈఓ వ్యవహారించిన తీరుపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తారని తెలిపారు. ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ తాను ఏ ఒక్క ఉపాధ్యాయ సంఘంను ఆహ్వానించలేదని, వారు ఏ పని మీద వచ్చారో తెలియదు. నూతన ఉపాధ్యాయులతో ఫొటో దిగుతుండగా వారు వచ్చి పక్కనే నిలబడ్డారు తప్ప తాను ఎవరిని ఆహ్వానించలేదన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

- భవిష్యత్ తరాల మనుగడకు ఆడబిడ్డలను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు సిటీ, అక్టోబర్ 14, ప్రభాతవార్త** భవిష్యత్ తరాల మనుగడకు ఆడబిడ్డలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. 11న జరిగిన అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యు కళాశాల నుంచి కెవిఆర్ పెట్రోలు బంకు మీదుగా కొనసాగిన ర్యాలీలో అధికారులు, అంగన్‌వాడీ, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. బాలికా విద్య లేకుంటే జగతికంతా మిధ్య, రేపటి తరాల ఆశాజ్యోతి ఆడపిల్ల, కూతురు కుటుంబానికి అందమైన కానుక, మానవజాతికి మూలం ఆడపిల్ల, ఆడపిల్లను కాపాడుకుందాం. అందమైన సమాజాన్ని నిర్మించుకుందాం వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఒక ఇంట్లో ఆడబిడ్డ చదువుకుంటే ఆ కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆడపిల్ల ఇంటి వెలుగు అని, ఆమె అనుకుంటే ఏదైనా సాధించగలదని, కుటుంబం కోసం ఆమె చేసే త్యాగం మరెవ్వరూ చేయలేరని మహిళల ఔన్నత్యాన్ని, ప్రతిభాపాటవాలను కలెక్టర్ కొనియాడారు. ఆడపిల్లల అభ్యున్నతికి కుటుంబం, సమాజం, ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. నేటి పోటీ పరీక్షల్లో కూడా బాలికలు ముందంజలో ఉన్నారన్న కలెక్టర్, బాలికలకు మెరుగైన విద్యను అందిస్తే వారు సమాజానికి విజయాలు అందిస్తారన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలు, ల్యాబ్‌లలో లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం ఆడబిడ్డలను అత్యంత జాగ్రత్తగా కాపాడుకోవడం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యతగా కలెక్టర్ చెప్పారు. జిల్లాలో వారంరోజుల పాటు ప్రజలకు ఆడబిడ్డల గొప్పతనం తెలిసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఐసిడిఎస్ పీడీ హేనాసుజన్, డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సుజాత, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఇంటర్ మీడియట్ ప్రాంతీయ అధికారి వరప్రసాద్, ఐసిడిఎస్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ఆశయసాధనకు కృషి

## జనసేన నగర అధ్యక్షుడు సుజయ్ బాబు



**నెల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త-విద్య :** తమకి ఎన్ని ఇబ్బందులు వచ్చినా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, తమ అదినేత పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం పని చేస్తామని జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్ బాబు తెలిపారు. మంగళవారం నగరంలోని స్తానిక మాగుంట లేఅవుట్ లక్ష్మీ ్మ శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేనపార్టీ లోని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నెల్లూరు డివిజన్ ఇన్‌చార్జ్‌లు, జనసైనికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశాన్ని నిర్వచించారు. ఈ సందర్భగా సుజయ్ బాబు మాట్లాడుతూ కొంతమంది జనసేన అంటే తామే అని కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. వైసీపీ లాంటి రౌడీ పాలనలో జనసేన జెండా మోసిన వారు తమ దగ్గరే ఉన్నారని, కొన్ని దుష్టశక్తుల నోర్లు మూయించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాల కోసం పనిచేశామని.. ఎవరినైతే జిల్లా అధ్యక్షుడిని నియమిస్తారో వారి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో పదికి పది సీట్లు వచ్చాయంటే జన సైనికుల కష్టం ఎంతో ఉందన్నారు. అధికారం ఉన్నా.. లేకపోయినా జనసేనలోనే ఉండి పనిచేస్తామన్నారు. శ్రామిక నగర్‌లో ఉన్న సమస్యలను టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ పరిష్కరించాలని కోరారు. ఏ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా తాము అండగా నిలబడతామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ మాట్లడుతూజిల్లాలో కొంతమంది పెద్దలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అరోపించారు .తాము ప్రజా సమస్యలపై పోరాటం చేశామని, నడికుడిశ్రీకాళహస్తి రైల్వే లైన్‌పై పోరాడామని, చుక్కల భూముల సమస్యలపై పోరాడి రాష్ట్ర వ్యాప్తంగా సమస్యను పరిష్కరించగలిగామన్నారు . జిల్ల పరిశీలకులు తమని ఉంటే ఉండండి.. లేకపోతే రాజీనామా చేసి వెళ్లిపోండి.. జిల్లాలో నేను చెప్పిందే చేయాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. సుళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ మాట్లడుతూప్రతి ఒక్కరూ కూటమి ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. 2019 నుంచి జనసేనలో ఓటమి లెక్కచేయకుండా బలోపేతం చేసే దిశగా పని చేశామన్నారు. రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఆ స్థానాల్లో జనసేన పార్టీని గెలిపించుకుని ముందుకు తీసుకెళ్లాలన్నారు. పవన్ కళ్యాణ్ ఎవరిని అధ్యక్షుడిగా నియమిస్తే వారితో కలిసి పని చేస్తామన్నారు. పలు సమస్యలను టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదన్నారు. గతంలో జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి వెంట నడిచామని. ఆయన పార్టీ మారిపోవడంతో నగరంలో సుజయ్‌బాబు వెంట నడుస్తున్నామన్నారు. కొద్ది రోజుల క్రితం సుజయ్ బాబుతో తిరిగితే మీకు మనుగడ ఉండదని కొంతమంది తమకు ఫోన్ చేసి చెప్పడం జరిగిందన్నారు. ఇకనైనా ఇలంటి సంఘటనలు పునరావృతం కకుండా చూడాలని కోరారు. నాయకుల బొబ్బేపల్లి సురేష్, కోలా విజయలక్ష్మి ్మ, నాగరత్నం యాదవ్, ఆలియా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్ ప్రపంచంలో ఏపీ చరిత్రాత్మక అడుగు

- రూ.87 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న దిగ్గజ సంస్థ గూగుల్
- గూగుల్ ప్రతినిధులతో ఢిల్లీలో భేటీ అయిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** టెక్ ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చరిత్రాత్మక అడుగులు వేసింది. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ విశాఖపట్నం కేంద్రంగా రూ. 87 వేల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగు పెట్టేలా అనుబంధ సంస్థ రైడన్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ గార్లు ఒప్పదం చేసుకున్నారు. ఢిల్లీలోని తాజ్ మాన్‌సింగ్ హోటల్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఢిల్లీలో గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈఓ థామస్ కురియన్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు, నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, లోకేశ్ ఈ మేరకు వివిధ అంశాలపై చర్చించారు. ఈ ఒప్పందంతో విశాఖను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నగరంగా రూపొందించడంలో తొలి అడుగు పడినట్లయింది. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో కార్యకలాపాలు ఆరంభించే తరుణంలో భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్ర ప్రదేశ్ గుర్తింపు పొందుతుంది. అమెరికా బయట అతి పెద్ద ఏఐ కేంద్రాన్ని విశాఖపట్నంలో పెడుతున్నారు. వచ్చే ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంలో ఐటీ ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అవిశ్రాంత కృషితో, కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఎసెంచర్ వంటి ప్రపంచస్థాయి కంపెనీలన్నీ క్యూ కడుతూ యువతకు ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తున్నాయి.

# నగరంలో పటిష్టంగా నాకా బంది

- ప్రత్యక్షంగా పరిశీలించిన ఎస్పీ అజిత వేజెండ్ల





**నెల్లూరు క్రైమ్ అక్టోబర్ 14, ప్రభాతవార్త :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా, రాత్రి పూట వాహనాల తనిఖీని తీవ్రతరం చేసి, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘీక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయుటకు నాకా బంది నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. యస్.పి ఆదేశాల మేరకు సోమవారం అర్ధరాత్రి నగరంలోని అన్ని కూడళ్ళు, హైవే, ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో నాకా బంది నిర్వహించి, విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. నాకాబందీ జరుగుతున్న తీరుతన్నులను బుజ బుజ నెల్లూరు, అయ్యప్ప గుడి సెంటర్, కరెంట్ ఆఫీస్, ఆర్టిసి బస్టాండ్, విఆర్‌సి తదితర ప్రాంతాలలో ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం బీట్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 52 ప్రదేశాలలో 1580 వాహనాలు తనిఖీ చేసి, ఓపెన్ డ్రింకింగ్ 52 కేసులు 52 మందిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ 17 కేసులు 17 మందిపై, 3వాహనాలు సీజ్ చేసి, లీజు యాక్ట్ కేసులు 179 నమోదు, రూ.58,795 జరిమానా విధించారు. రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల చర్యలపై నిఘా తీవ్రతరం చేయాలని, అర్ధరాత్రి వేళలో ప్రత్యేకంగా టౌన్ పరిధిలో రౌడీయిజం, దౌర్జన్యాలను నిర్మూలనకు వాహనాల తనిఖీ చేపట్టి సమగ్ర చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు సురక్షితంగా, శాంతియుతంగా నిద్రించేలా చూడడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ప్రధాన రోడ్లు, హైవేలపై రౌడీ షీటర్లు గానీ, ఎవరైనా వీధుల్లో సమూహంగా తిరిగినా, అనుమానాస్పదంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రాత్రి వేళల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతుల్ని చేసే రౌడీలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలోని నేర ప్రవృత్తి గల ప్రాంతాలపై ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా నిఘా నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, గంజాయి సేవించే మరియు వ్యాపారులను అరికట్టుట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా సరిహద్దుల్లో నేరాలను నియంత్రించడానికి అన్ని ప్రధాన రోడ్ల మీదుగా చెక్ పోస్టుల ద్వారా నిఘాను పటిష్టం చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, సరిహద్దు ప్రాంతాల్లోని ఇప్పటికే ఉన్న చెక్పోస్టుల సామర్థ్యాన్ని పెంపొందించడం, అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా మొబైల్ చెక్ పోస్టులను ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. అంతర జిల్లా పోలీసుల సమన్వయంతో నిరంతరం సమాచారం మార్పిడి, జిల్లా సరిహద్దుల్లో పటిష్టమైన తనిఖీల ఏర్పాటు, అక్రమ రవాణా నియంత్రణ, నేరస్తులగుర్తింపుకు సమగ్రచర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గురించి గానీ, రౌడీయిజం గురించి గానీ సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కుగానీ, డయల్ 112కుగానీ తెలియచేయాలని ప్రజలకు సూచన. ప్రజల సహకారంతో మాత్రమే పూర్తి స్థాయి నేర నియంత్రణ సాధ్యమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

## ఆడ పిల్లని పుట్టనిద్దాం.. ఆడపిల్లల్ని రక్షిద్దాం

- డీఎంఅండ్‌హెచ్‌ఓ వి.సుజాత



**నెల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** సమాజంలో ఆడ పిల్ల పుట్టుక ఎంతో అవసరమని, వారికి చదువు సంస్కారం నేర్పి, వివక్షకు తావు లేకుండా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి వి.సుజాత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం నెల్లూరులోని నవాబుపేట రైతు బజార్ వద్ద నున్న పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సేవ్ ది గర్ల్ చైల్డ్ క్యాంపెయిన్ లో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఆడా , మగ అన్న వ్యత్యాసాన్ని విడనాడి, వివక్షకు తావు లేకుండా ఆడ పిల్లలను పుట్టనిద్దామని పేర్కొన్నారు. బాలికలకు ఆరోగ్య సంరక్షణతో పాటు, వారిని చదువుకునేలా ప్రోత్సహిస్తూ, వారు కూడా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వివరించారు. అన్ని రంగాల్లో ఆడ పిల్లలు మగవారితో సమానంగా రాణిస్తున్నారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నినాదం అయిన నేను ఆడ పిల్లను మార్పు నాతోనే ప్రారంభం అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఏటీఓ డాక్టర్ ఎస్కే ఖాదర్ వలీ, డీఐఓ డాక్టర్ ఏ.ఉమా మహేశ్వరి, డెమో కే.కనకరత్నం, డీపీఎంఓ డాక్టర్ ఎం.రమేష్, డాక్టర్ విశ్వ సుల్తానా, ఏ.వెంకటేష్, కరుణమ్మ, వేణు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు, కళాశాలల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి : ఎంపీడీవో



**విడవలూరు,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నగేష్ కుమారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి, స్వంత పన్నులు, రుసుములు, అద్దెల ద్వారా సేకరించే ఆదాయాన్నిపై, ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాణా సంచి దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

– సిఐ వేమారెడ్డి



**సంగం అక్టోబర్ 14 ప్రభాతవార్త :** సంగం సర్కిల్ పరిధిలో సంగం, చేజర్ల,ఎ.ఎస్.పేట మండలాల బాణా సంచా దుకాణదారులు ఎటువంటి అనుమతులు తీసుకోవాలి,నిబంధనలు ఏమిటి అన్న విషయంపై సిఐ వేమారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిబంధనలు అతిక్రమించి,అక్రమంగా బాణా సంచా తయారీ,విక్రయించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్కిల్ పరిధిలో బాణా సంచా తయారీ , విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండి,ప్రభుత్వ నియమనిబంధనలకు లో బడి బాణా సంచా విక్రయించాలని సూచించారు. బాణా సంచా వంటి పేలుడు పదార్ధాలు ఇంట్లో నిలువ ఉంచరాదని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో సంబంధిత అధికారులు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే నిర్ణీత ప్రమాణాల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో సంగం ఎస్ఐ రాజేష్, చేజర్ల ఎస్ఐ తిరుమలరావు, ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు పాల్గోన్నారు.

## పంచాయితీలో సొంతంగా ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి



**మనుబోలు అక్టోబర్ 14 ప్రభాతవార్త :** ప్రతి పంచాయితీ సొంతంగా ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని ఎంపిడిఒ జలజాక్షి సూచించారు. మంగళవారం ఎంపిపి వజ్రమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు,పంచాయితీ సెక్రటరీలు,రెండు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జలజాక్షి మాట్లాడుతు పంచాయితీ పరిధిలో నూటికి నూరుశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. దీంతోపాలు ఆర్థిక వనరులను పెంచుకోవడంపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు,దుకాణాలకు సంబందించి లైసెన్స్‌లు,గ్రామ పరిధిలో ఉన్న పంచాయితీకి సంబందించిన ఆస్తుల లీజు వేలం పాటవంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. స్థానిక వనరులు ఎలా పెంచుకోవాలన్న అంశంపై రిసోర్స్ పర్సన్ల హరిప్రసాద్‌రెడ్డి, జయంతి,వివరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఒ గరుడయ్య, ఏవో ముజీబున్నీసా, సర్పంచులు, పంచాయితీ సెక్రటరీలు తదితరులున్నారు.

## మహిళా చట్టాలపై మహిళలు అవగాహన కలిగి వుండాలి

## స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ హేనసుజెన్



**నెల్లూరు సిటీ, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** మహిళలు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనసుజెన్ పేర్కొన్నారు. మంగళ వారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ నెల్లూరు నందు బేటి బచావో బేటి పడావో శక్తి సింబల్ మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు మహిళ సాధికారత, మహిళలు వారి కోసం వున్న చట్టాలు, వాటిని ఎలా ఉపయోగించు కోవాలి అనే విషయాలు లీగల్ ఆవేర్నెస్‌లో భాగంగా డివియాక్ట్ 2005, ఫోక్సో యాక్ట్ 2012, విమెన్ సేఫ్టీ లెజిస్లేషన్ వంటి చట్టాలపై వివరించారు. సెల్ ఫోన్ వల్ల ఆడపిల్లలు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. వాటినుండి బయట పడుటకు నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిమేట్ ఇమేజ్ అబ్యూస్ గురించి వివరించారు. పోష్ యాక్ట్ 2013 షీ బాక్స్, హెల్ప్ లైన్ నెంబర్ 181,1930 ,112,1098 గురించి వివరించారు. సఖి సేవలు గురించి సూచించారు. వివాహం తరువాత స్త్రీ పై జరుగుతున్న వివక్షిత గురించి మాట్లాడుతూ ఎందుకు యువత దంపత్య జీవితలో సమస్యలు అధకమించ లేక విడిపోతున్నారో దీనికి పరిష్కారం ఎలా అన్న విషయాలు పై అవగాహన కల్పించారు. ఇటీవల లాంచ్ కాబడిన ప్రీ మారిటల్ కౌన్సిలింగ్ సెంటర్ యొక్క ప్రాధన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అనురాధ, అర్బన్ సిడిపిఒ అరుణ, డీసీపియు యూనిట్ నుండి ఎల్ సి ఓ మంజుల, వారి సిబ్బంది, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ఎస్ కె. షహనాజ్, స్టాఫ్ లీగల్ ఎన్. ప్రశాంతి, కేస్ వర్కర్ జి. సాధన, పి. శారద, కౌన్సిలర్ కమల, మెడికల్ లీలావతి, గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ నెల్లూరు, కళాశాల ప్రిన్సిపాల్ వి.ఎఫ్. ఆశాలత పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచితే విక్రయిస్తే చర్యలు తప్పవు



**మనుబోలు అక్టోబర్ 14 ప్రభాతవార్త :** రానున్న దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా టపాసులు నిర్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్ఐ శివ రాకేష్ హెచ్చరించారు. మంగళవారం సాయంకాలం స్థానిక పోలీస్ స్టేషన్‌లో లైసెన్స్ కలిగిన టపాసులు దుకాణ దారులతో సమావేశాన్ని నిర్వహించారు. బాణా సంచా దుకాణాలలో తప్పని సరిగా ప్రభుత్వ నియమ నిబంధలను పాటించాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ వుంచినా,విక్రయించినా వారిపై ప్రేలుడు పదార్ధాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు తప్ప కుండా లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు.దీపావళి టపాకాయాల విక్రయదారులు జనసంచారం ఉన్న ప్రదేశాలలో ప్రజల నివాస ప్రాంతాలలో టపాకాయాలు విక్రయించరాదని అన్నారు.నీరు,ఇసుక,తదితర అగ్ని మాపక సామాగ్రిని తప్పని సరిగా టపాసుల దుకాణాల దగ్గర ఉంచుకోవాలని అన్నారు. నిబంధనలకు విర్దుంగా వ్యవహరిస్తు చర్య తీసుకుంటామని అన్నారు..

## పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు



**కలువాయి అక్టోబర్ 14 ప్రభాతవార్త :** పంచాయితీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పంచాయితీల స్వయం సమృద్ధికి మౌళిక సదుపాయాల కల్పన,పారిశుద్ధ్య నిర్వహణ పంచాయితీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు దిశగా వనరులను సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలని ఎంపి డిఒ శైలజా పేర్కున్నారు.గ్రామ పంచాయితీలలో సొంత ఆదాయ వనరుల పెంపుదల గురించి రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌లు,పంచాయితీ కార్యదర్శులు పాల్గోన్నారు. ముందుగా మహాత్మా గాంధీ,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతు గ్రామ పంచాయితీ ల పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న పన్నులను పన్నేతరాలను సక్రమంగా వసూలు చేయండంతోపాటు గ్రామ పంచాయితీలలో సొంతంగా ఆదాయ వనరులను పెంపొందించుకునే అవకాశాలను పరిశీలించి వాటిని అదే పుచ్చుకోవాలని సూచించారు. డిప్యూటి ఎంపిడిఒ జి.వి రమేష్‌బాబు మాట్లాడుతు గ్రామ పంచాయితీలలో ప్రజల సహకారంతో అనేక వసతులు ఏర్పాటు చేసుకొని నిర్వహణ ద్వారా అధిక ఆదాయాం పొందుతున్నట్లుగా కృషి చేయాలని తెలియజేశారు.

## ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం



**ఆత్మకూరు,అక్టోబరు14,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణం లోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఇతర అధికారులు హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టాల్సి న పనులు, నిధుల వివరాలను ఈకార్యక్రమంలో ఎంపిడిఒ రఫీఖాన్ వివరించారు. గ్రామాల్లో చేపట్టాల్సి న అత్యవసర పనుల గురించి గ్రామ అవసరాల గురించి సమావేశంలో చర్చించారు.

## జంగాలపల్లి లో పౌష్టికార ఉత్సవాలు



**వెంకటాచలం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల పరిదిలోనే ఇడిమేపల్లి పంచాయతీ లోనే జంగాలపల్లి గ్రామంలో పౌష్టికార మహోత్సవాలను మంగళవారం నిర్వహించారు.సిడిపిఒ విజయలక్ష్మీ ఆదేశాల మేరకు పౌష్టికార ఉత్సవాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ పద్మజ హాజరై పౌష్టికార ఉత్సవాల గురించి గర్భవతులకు,తల్లులకు వివరించారు.అనంతరం మాట్లాడుతూ చిరుదాన్యాలు పిల్లల బరువు ఎదుగుదల పిల్లలకు పెరుగుదలకు కావాల్సిన ఆహార నియమాలు పద్ధతుల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కవిత,హెల్పర్ అరుణ గ్రామస్తులు పాల్గొన్నారు

## కొండసముద్రంలోమ అంగన్‌వాడీ కార్యక్రమం



**వలేటివారిపాలెం అక్టోబరు 14, ప్రభాతవార్త :** మహలక్ష్మిలాంటి ఆడపిల్లలను రక్షించుకుందామని స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సునీత సిబ్బందికి సూచించారు.మంగళవారం మండలంలోని కొండసముద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ్ మహ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యకర్త నాగశిరోమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆహారంలో చిరుధాన్యాలు,ఆకుకూరలు, పండ్లను వినియో గించాల న్నారు.తద్వారా ఒనగూరే ప్రయోజ నాలను ఆమె వివరించారు. అంతర్జాతీయ బాలికదినోత్సవ కార్యక్ర మంలో బాగంగా ఆడపిల్లలపై జరుగు తున్న అఘాయిత్యాల నివారణకు వినియోగించాల్సి న చట్టలను వివరించారు.భ్రూణహత్యలను అడ్డుకో వాలన్నారు. గర్భవతులకు శ్రీమంతం, ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెడ్మాష్టర్ గోపాలరెడ్డి, సిబ్బంది శిరీషాలతోపాటు పలవురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రమాదావశాత్తూ రైలు ఢీకొని టీచర్ మృతి



**నెల్లూరు క్రైం, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ప్రభుత్వ ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం స్థానిక వేదయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మణుగూరు మండలం కొలనకుదురు గవర్నమెంట్ స్కూల్ లో టీచర్ గా పనిచేస్తున్న చదలవాడ పద్మావతి (50) వేదాయపాలెం రైల్వే స్టేషన్ రైల్వే గేటు వద్ద రైలు రాకకై గేటు వేసి ఉన్నప్పటికీ రైలు బండి రాకను గమనించుకోకుండా ఆమె రైలు పట్టాలు దాటి వెళ్ల క్రమంలో ప్రమాదవశాత్తు అదే సమయంలో రైలు బండి ఢీకొనడం వలన కలిగిన గాయాల వలన ఆమె అక్కడికక్కడే మరణిఒచడం జరిగింది. ప్రమాద విషయం తెలుసుకున్న ప్రమాద విషయం తెలుసుకున్న రైల్వే ఎస్సై వి. హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్పంచ్‌లకు కార్యదర్శిలకు రెండురోజుల శిక్షణా కార్యక్రమం



**కలిగిరి, అక్టోబర్14,ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని అన్నిపంచాయితీల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్సి ల రెండురోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది.కలిగిరి మండలంలోని 23 పంచాయితీలకు సంభందించిన సర్పంచ్‌లు, అదేవిదంగా కార్యదర్సి లకు కలిగిరి యంపిడిఓ కార్యాలయంలో యంపిడిఓ ప్రత్యూష అధ్యక్షతన శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఈసందర్భంగా యంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిదులు, అదికారులసమక్షంలో ఓయస్ఆర్ శిక్షను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు.

## ఒకపక్క పొగాకు అమ్మకాలు;మరోపక్క పొగనారుమళ్ల పెంపకాలు



**కలిగిరి, అక్టోబర్14, ప్రభాతవార్త;** రైతు పరిస్తితి రోజురోజుకూ దయనీయంగా మారుతుంది.వ్యవసాయమే ఆదారంగా బతుకుతున్న రైతుపై ప్రభుత్వం,పాలకులు నాట్యం చేస్తున్నారు. కానీ ఆశచావని రైతుమాత్రం మట్టినే నమ్మకొని బతుకు జీవనం సాగిస్తున్నాడు. పొగాకు పంటప్రతిసంవత్స రం డిసెంబర్, జనవరిమాసంలో వస్తుంది. పంట కొనుగోలు పిబ్రవరి, మార్చి నెలలో ప్రారంబిస్తారు. ఈకార్యక్రమం మరోమూడు, లేదానాలుగు నెలల్లో ముగిస్తుంది.అనంతరం రైతుచేతికి డబ్బులు వస్తా యి. కానీ రైతు సహనాన్ని పరీక్షిస్తున్న పాలకులు వారితో ఆడుకుంటున్నారు. మూడునెలల్లో అమ్మకాలు పూర్తయి రైతుచేతికి డబ్బులు వస్తే ఉన్న వ్యవసాయ అప్పులు తీర్చుకొని మిగిలిన డబ్బులతో కుటుంబకర్చులు, అవసరాలు తీర్చుకుంటాడు. అదే కర్చులే తీరక, మరోసారి అప్పులు పుట్టకపోతే ఆరైతు పరిస్తితి అగమ్యగోచరంగా తయారౌతుంది. ఈక్రమంలో డిశంబరులో పంట చేతికి వచ్చినా అక్టోబర్ నెలలోసైతం పొగాకు రైతు ఇంకా తాను పండించిన పొగాకు అమ్మకాలు సాగిస్తున్నారు. తెచ్చిన పొగాకు అమ్ముడుపోక, పెట్టిన పెట్టుబడికి గిట్టుబాటు కాక పొగాకు కంపెనీలు అడిగిన రేటుకు అమ్ముకోలేక రైతు విలవిలలాడి పోతున్నాడు. రేటు దక్కన్నప్పుడల్లా తిరిగి ఇంటికి తీసుకుపోవడం మరలావారం రేటువస్తుందేమోననే ఆశతో మరలా అమ్మకాలకు తీసుకురావడంతో గతనాలుగైదు నెలలుగా సరైన ధరకోసం ఆశచావని రైతు ఎదురు చూస్తున్నాడు. ఇది ఇలా ఉంటేమరో నెలరోజుల్లో పొగాకు నాటే సీజన్ మొదలవడంతో ఇప్పటినుండే రైతు పొగనారు పోసి పెంచుకుంటున్నాడు. అమ్ముడుపోని పొగాకు కళ్లముందు ఉన్నా, పొగాకు తెచ్చిన అప్పులు ఇంటిలో తాండవిస్తున్నా సరైన ధరపలకక పోవడంతో ఇప్పటికీ రైతు పొగాకు బోర్డుచుట్టూ పొగాకు అమ్మ కాలకోసం కాళ్లరిగేలా తిరుగుతునే ఉన్నాడు. చూస్తున్నారా.. పాలకులారా!.

## రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ కోఆర్డినేటర్ కి అభినందనలు



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** నెల్లూరు రెడ్ క్రాస్ క్యాన్సర్ వైద్యశాల కోఆర్డినేటర్ గా కావలి నుంచి తొలి సారిగా ఎంపికైన నిస్వార్థ సేవకుడు, ప్రచార రహిత సామాజిక కార్యకర్త, రెడ్ క్రాస్ బాధ్యులు కలికి శ్రహరి రెడ్డిని సోమవారం బీసీ ఐక్య భవన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ జయప్రతాప్ రెడ్డి, బీసీ ఐక్యత భవన్ అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్, శ్రీకాంత్ , చిన్ని వరప్రసాద్ లు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

## సంజీవిని స్వరం బహిరంగ సభను జయప్రదం చేయండి

– ఆంధ్రప్రదేశ్‌లోని నాయిబ్రాహ్మణులంతా విచ్చేయండి



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** వైద్యానికి ఆది గురువైన ధన్వంతరీ మహర్షి జయంతిని పురస్కరించుకుని 18వ తేదీ సంజీవిని స్వరం పేరుతో తిరుపతిలో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపి శ్రీనివాస్ తెలిపారు. నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నాయిబ్రాహ్మణ నాయకులను, కార్యకర్తలను ఒక చోట చేర్చి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు తొలుత శోభాయాత్రను నిర్వహించి, అనంతరం సభను నిర్వహిస్తామని చెప్పారు. ధన్వంతరీ మహర్షి యొక్క లక్ష్యాలను ముందుకు తీసుకుపోయే క్రమంలో నాయి బ్రాహ్మణ సమాజం జీవన విధానాన్ని అధ్యయనం చేసే విధంగా ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. గత పాలకులు నాయి బ్రాహ్మణులను నిర్లక్ష్యం చేశారని వారి జీవన ప్రమాణాలు పెరిగే విధంగా కృషి చేస్తామని చెప్పారు. సౌందర్యం, సంగీతం, ఆరోగ్యం ప్రాతిపదికగా జీవించే నాయిా బ్రాహ్మణుల యొక్క వృత్తి ప్రాముఖ్యతను ప్రతిబింబించేదిగా ఈ సభ ఉంటుందని వెల్లడించారు. సంజీవిని స్వరం పేరుతో నిర్వహించే ఈ సభ యొక్క పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగరాల సురేష్, మండల అధ్యక్షులు కోసూరు సుధీర్, ఫణి కుమార్, రాఘవులు, విజయ కుమార్, పెంచలయ్య, ఏడుకొండలు, భాస్కర్ పాల్గొన్నారు.

## కార్యకర్తలు సమయపాలన పాటించాలి



**వింజమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమన్వయంతో సమయపాలన పాటిస్తూ కేంద్రాలు నిర్వహించాలని సీడీపీవో పద్మజాకుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 8వ రాష్ట్రీయ పోషణ మాసం విధిగా ప్రతి కేంద్రంలో నిర్వహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజలలో మారుతున్న ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాతకాలపు వంటల సాంప్రదాయాన్ని మరలా తిరిగి తీసుకొచ్చేందుకు పోషణ మాసోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆహారపు అలవాట్లు విభిన్నంగా మారాయని, తద్వారా పిల్లల్లో పౌష్టికాహార లోపం కలిగి అనారోగ్య సమస్యలతో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు ఉండకూడదని సంకల్పంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా పోషక ఆహారంపై అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా స్థూలకాయ నివారణకు చక్కెర, నూనెలు తక్కువగా వాడాలని, చిన్న పిల్లల ఆహార అలవాట్లు సరైన పద్ధతిలో ఉండాలన్నారు. పిల్లల పోషన్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. తక్కువ ఖర్చుతో ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు రెండు సంవత్సరాలు వయసు వచ్చేంత వరకు శ్రద్ధగా చూసుకోవాలన్నారు. వారికి తగినవిధంగా పోషకాహారం అందించాలని సూచించారు.అడిషనల్ సీడీపీవో శర్మిష్ట, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** నగరంలోని కొండయపాలెం రైల్వే గేట్ సమీపంలో మెము రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతునికి సుమారు 45 నుండి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతుడు తెలుపు రంగు గల ఫుల్ హాండ్స్ షర్ట్, బులుగు కలర్ చెక్స్ లుంగీ ధరించి ఉన్నాట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భ్రూణహత్యలు అడ్డుకొండి- సూపర్‌వైజర్ శివరామయ్య



**వలేటివారిపాలెం అక్టోబరు 14, ప్రభాతవార్త :** లింగవివక్షత నేపద్యంలో నెలకొంటున్న భ్రూణహత్యలను అడ్డుకోవాలని స్థానిక హెల్త్ సూపర్‌వైజర్ శివరామయ్య సూచించారు.మండలంలోని పోలినేని పాలెం కస్తూరిబా విద్యాలయంలో సేవ్ ది గరల్ చైల్డ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర భ్ంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో పురు షుల కతీతంగా రాణిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభు త్వాలు అనేక రకాల చట్టాలు అమలుచేస్తున న్టట్లు చెప్పారు. చదువుల్లో సరస్వతీదేవిగానూ,సంపదలో లక్ష్మీదేవి తోనూ, ధైర్యంలో దుర్గామాతగానూ బావించే హిందూ సమాజంలో ఆడపిల్లలపై అత్యాచారాలు, మాన బం గాలు, లైంగికదాడులు,యాసిడ్ దాడులు, గృహహింస,కిడ్నాపులు,భ్రూణహత్యలు తదితర సంఘటనలతో మహిళలను తుదముట్టించుడం హేయమైన చర్యగా ఆయన అభిప్రా యపడ్డారు. బాలికల అభ్యున్నతికి కిషోరిశక్తియోజన,ఆయుస్మతి యోజన, విద్యా భివృద్దికి బేటీబచావో..బేటీ పడావో తదితర పథకాలు అమలు చేస్తన్నట్లు తెలిపారు. మహిళలు తల్లి, చెల్లి ,బార్య, అక్క తదితర పాత్రల్లో కీలక పాత్రపోషిస్తున్నారని శివరామయ్య అన్నారు. అలాంటివారిపై లింగ వివక్ష ప్రయోగించడం చట్టరీత్యా, న్యాయరీత్యా, ధర్మరీత్యాన నేరమన్నారు.అసాంఘిక చర్యలపూ ఎదుర్కొ నెందుకు మహిళలు సిద్దంకావాలని, ఇందుకు ప్రభుత్వ సహ కారం వినియో గించు కోవాలని శివరామయ్య సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుజాతతో పాటు పలువురు విద్యార్దినిలు,టీచర్లు పాలొ్గన్నారు.

## చుండిలో సేవ్ ది గరల్ చైల్డ్ ర్యాలీ



**వలేటివారిపాలెం అక్టోబరు 14, ప్రభాతవార్త :** మండలంలోని చుండిలో మంగళవారం సేవ్ ది గరల్ చైల్డ్ అనే కార్యక్రమంపై అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహిం చారు. స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ శిరీషా, ఏఎన్ఎం లావణ్యల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలపై నెలకొ ంటున్న లింగవివక్షతను నిర్మూలిం చాలని నినదిం చారు. ఆడపిల్ల పుట్టక సమాజానికి చాలా అవసర మన్నారు .భ్రూణహత్యలతో తుదము ట్టించా లను కోవడం అవివేక మన్నారు.స్త్రీలేని సమాజంను ఊహించగలమా అని శిరీషా అన్నారు. ఆడపిల్లను పుట్ట నిద్దాం. ఎదగ నిద్దాం.చదవనిద్దాం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహిఒచారు.ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్‌కు సమాజంలోని అన్ని రంగాలలోని వ్యక్తులు సహకరించాలని కృషి చేయాలని వారు సూచించారు.ఈ కార్య క్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుప్రియతోపాటు పలువురు ఉపాధ్యాయులు విద్యార్దినిలు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని బాణసంచా దుకాణదారులపై చర్యలు

– బాలాజీ నగర్ సీఐ సాంబశివరావు



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాణా సంచా దుకాణాలు నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాలాజీ నగర్ సీఐ సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిర్దేశించిన నిబంధనాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే వారి మీద కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేటప్పుడు, అందుకు సంబంధించి నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## లైసెన్సులు ఉంటేనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి

## అక్రమ ఇసుక మాఫియా పై చర్యలు : కోవూరు సీఐ



**కోవూరు అక్టోబర్ 14 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని కోవూరు ఇందుకూరు పేట మండలాల్లో.. దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్సులు ఉంటేనే ఏర్పాటు చేసుకోవాలని కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా లైసెన్సు ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు అదేవిధంగా రెవెన్యూ పోలీస్ ఫైర్ అధికారుల నుంచి కూడా తప్పనిసరిగా అనుమతి ఉండాలన్నారు కోవూరు ప్రాంతంలో సురక్షి తమైన ప్రదేశాల్లో ఈ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ పోలీస్ ఫైర్ ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు లేని ప్రాంతాల్లో మాత్రమే వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు లైసెన్సు లేకు ండ వ్యాపారం నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కేసులు పెట్టి జైలుకు కూడా పంపడం జరు గుతుందన్నారు అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్దేశించిన పెన్నా నది పరవాక ప్రాంతాల్లో మాత్ర మే ఇసుకను తీసుకోవాలని అట్లు కాక ప్రొక్లైన్లు జెసిబిలు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే అటు వంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు సోమవారం అర్ధ రాత్రి జమ్మిపాలెం పెన్నాది పరివాహ ప్రాంతంలో అక్రమంగా తత్వం మడి తరలిస్తున్న ప్రొక్లైన్ టిప్పర్ను సీజ్ చేసివారిపై కేసు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు ఈకార్యక్రమంలో ఎస్ఐ రంగనాథ్ గౌడ్ ఉన్నారు

## ఆదాయ వనరుల పెంపుపై శిక్షణా తరగతులు



**అనంతసాగరం,అక్టోబరు14,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని మండల పరిషత్ కార్యా లయంలో మంగళవారం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వద్యంలో గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదల గురించి రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండ లాధ్యక్షురాలు పెయ్యల సంపూర్ణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అండేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న నిధులను వినియోగంచడమే కాక గ్రామప ంచాయతీకి రావాల్సి న పన్ను వసూళ్ళు నూరుశాతం సాధించి పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ స్వయం సమృద్ధికి, మౌళిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సొంత ఆదాయ వనరులను సమకూర్చడంపై దృష్టిసారించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యాలయ ఎఒ మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు నర్శింహులు, మొహిసీన్, డిజిటల్ అసిస్టెంట్ సతీష్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత: కాల మునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజ లను సాంప్ర దాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిఒచారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్ర మాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## మనిషి ఆరోగ్యంగా జీవించేందుకు ఏ1 చికిత్స చేస్తుంది



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** 2050 నాటికి మన జీవితం ఊహించలేనంతగా మారిపోతుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,రోటోట్స్, గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ సిటీస్ ఇవన్నీ మన దైనందిన జీవితంలో భాగం అవుతాయి అని చిలక డిజిటల్ సొల్యూషనన్స మేనేజింగ్ డైరక్టర్ చిలకా ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏ1, రోబోట్స్ మన స్నేహితుల్లా మారతాయి. ఇంట్లో పనులు చేసే రోబో మేడ్స్, ఆఫీస్‌లో సహాయక ఏ1 అసిస్టెంట్లు, పిల్లలకు పాఠాలు చెప్పే డిజిటల్ టీచర్లు, ఇవన్నీ సాధారణ దృశ్యాల వుతాయి. మన జీవితం మరింత సులభం, స్మార్ట్‌గా మారుతుంది అని చెప్పారు. 2050 లో రైతులు మట్టిని తాకకుండానే పంటలు పండించగలుగుతారు. సెన్సార్ టెక్నాలజీ, డ్రోన్ ఇరిగేషన్, ఏ1 ఆధారిత వాతావరణ అంచనాలతో వ్యవసాయం పూర్తిగా డిజిటల్‌గా మారుతుంది. ప్రతి గింజను టెక్నాలజీ కాపాడే రోజులు రానున్నాయి. భవిష్యత్ స్కూల్స్‌లో విద్యార్థులు బోర్డుపై కాకుండా వర్చువల్ రియాలిటీ గ్లాస్‌లతో నేర్చుకుంటారు. హైదరాబాద్, టోక్యో, లండన్ విద్యార్థులు ఒకే క్లాస్ రూమ్‌లో కలిసి చదివే అవకాశం ఉంటుంది. ఇది సరిహద్దులు లేని విద్యాయుగం అవుతుంది. రోగాలు బయటపడకముందే ఏ1 వటిని గుర్తిస్తుంది. డీఎన్ఏ ఆధారంగా ప్రతి వ్యక్తికి ప్రత్యేక చికిత్స అందుతుంది. ఆపరేషన్లు రోబోట్స్ చేస్తాయి, వైద్యులు కేవలం మానిటరింగ్ మాత్రమే చేస్తారు. భవిష్యత్తులో మానవుని జీవన కాలం 150 సంవత్సరాల వరకు పెరిగే అవకాశం ఉంది. గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ సిటీస్ భవిష్యత్తులో ఇంధనం సోలార్, విండ్, హైడ్రోజన్ రూపంలో వస్తుంది. ప్రతి ఇల్లు ఒక చిన్న పవర్ స్టేషన్‌లా మారుతుంది. ట్రాఫిక్ లేకుండా ఏ1 నియంత్రిత వాహనాలు, కాలుష్యం లేని సిటీలు మన పిల్లల భవిష్యత్తు భారత టెక్ మేధస్సు ప్రపంచ భవిష్యత్తుని నడిపిస్తుంది. స్వదేశీ ఆవిష్కరణలలో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శి అవుతుంది అని ప్రవీణ్ ఆ ప్రకటనలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇదంతా మనకు వింతగా అనిపించినా, భవిష్యత్తులో జరగబోయేది ఇదేనేమో.

## రాబోయే 100 ఏళ్లకు ఉపయోగపడేలా షాదీ మంజిల్‌ను నిర్మించాం



**నెల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త – వైద్యం :** ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మున్సిపల్ కమీషనర్ నందన్‌తో కలిసి మంగళవారం కొటమిట్టలోని షాదీ మంజిల్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మరమ్మత్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పరిశీలించిన అనంతరం అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడుతూ నారాయణ మంత్రిగా నేను మేయర్‌గా ఉన్నప్పుడు షాది మంజిల్‌ను ప్రారంభించాం. రాబోయే వందేళ్ళ వరకు ప్రజలకు ఉపయోగపడాలని నిర్మించాం. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మా డిజైన్లు మార్చేసింది. నెల్లూరులో పిటి స్లాబ్లతో నిర్మించిన మొట్టమొదటి నిర్మాణం ఇది. ప్రజలపై భారం పడకూడదని 20 లక్షల రూపాయలతో మంత్రి నారాయణ ఎంపీ వీపీఆర్ ఫైబర్స్ సామాగ్రిని ఉచితంగా అందజేశారు. సెక్యూరిటీ లేదని అడగగానే కమీషనర్ 24/7 సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. షాదీ మంజిల్‌కు కన్వీనర్‌గా కమీషనర్‌ను పెట్టి నలుగురు మత పెద్దలతో నలుగురు ప్రజా ప్రతినిధులతో కమిటీ వేస్తాం. పెళ్లిళ్ల లేకుండా ఖాళీగా ఉన్నప్పుడు కమిటీ వారు ఎక్స్‌లో నిర్వహించి ఆదాయాన్ని పెంచి పేద ఆడ బిడ్డలకు ఉచిత వివాహాలు చేయాలి. వారికి కావాల్సిన బేసిక్ కిట్‌ను అందజేయాలి. కార్పొరేషన్‌లో ఆర్థిక లోటు ఉన్న షాది మంజిల్‌లో మరమ్మత్తులు నిర్వహిస్తున్న కమీషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఇది ప్రజల ఆస్తి రాజకీయాలకు పార్టీలకు సంబంధించింది కాదు. దీనిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది. వక్ఫ్‌బోర్డు భూమి గురించి మాట్లాడుతూ జామియా మసీద్ ఆస్తిని కాపాడేందుకు వక్ఫ్ అధికారులు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. జామియా మసీదు స్థలాలను మూతవల్లీలు అమ్మేసేందుకు సేల్ అగ్రిమెంట్ చేయడంతో సస్పెండ్ చేశా. వక్ఫ్ ఆస్తులు కొనినా అమ్మినా చెల్లవని ప్రజలు గ్రహించాలి. మిగిలి ఉన్న ఆస్తులను కూడా అమ్మేస్తారన్న భయంతో సర్వే నిర్వహించి ప్రహరీ గోడ నిర్మించబోతున్నాం. వక్ఫ్ బోర్డులో పది వేల వక్ఫ్ సంస్థలు ఉన్నాయి. రోజుకో సంస్థను సమీక్షించినా నాకు ఉన్న సమయం అయిపోతుంది. వక్ఫ్ భూములను కాపాడటం నా బాధ్యత. సర్వే పూర్తయ్యాక నిధులు సమకూరిన తర్వాత జామియా మసీదు స్థలాన్ని ఏం చేయాలో ఎలా చేయాలో చూద్దామని చెప్పాను. ప్రజల నుంచి పలు రకాల వినతులు వస్తున్నాయి. ఏం చేయాలో ఎలా చేయాలో ఎప్పుడు చేయాలో చర్చిస్తాం. నిధులు ఏర్పాటు చేసుకోకుండా ఏం చేస్తామో ఎలా ప్రకటిస్తాం..? నెల్లూరులో పొట్టేపాలెం వద్ద 4.30 ఎకరాల వాక్కు భూమికి సర్వే చేశాం దేవుడి స్థలాన్ని కాపాడమని హిందువులు ముందుకు వస్తున్నారు. ఈ రోజు వరకు ఆ స్థలాన్ని కాపాడమని మసీదు వారు ముందుకు రాలేదు. ఎవరు ముందుకు వచ్చినా రాకపోయినా మసీదును కాపాడాల్సిన బాధ్యత నాది ప్రభుత్వానిది. ఎటువంటి కోర్టు వివాదాలు లేవు. కాబట్టి జామియా మసీదు స్థలాన్ని చదును చేశాం. మాగుంట లేఅవుట్‌కే రెడ్డి ఇంటి వద్ద నుండి మొత్తం వక్ఫ్ స్థలాలే. 1983 నుండి కోర్టు వివాదాల్లో ఉన్నాయి. అక్కడికి వెళ్లి కంచె వేయలేం. అక్కడ కూడా కంచె వేసే రోజులు వస్తాయి. దేవుడి పేరు చెప్పే సమాజం పేరు చెప్పి వైఎస్సార్‌సీపీ నాటకాలు ఆడుతుంది. ఎవరైతే మా భూమి మా భూమిని అని గొంతు చించుకున్నారో ఈ రోజు వారు భూమి కోసం మర్డర్లు చేసుకొని జైల్లో ఉన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి దేవుడి పనులు జాగ్రత్తగా చేయాలి. నా కంఠంలో శ్వాస ఉన్నంత వరకు ఒక్క అంగుళం భూమి కూడా పోనివ్వను. పార్టీలు బంధుత్వం స్నేహితం నావద్ద పనిచేయవు.వైజాగ్ నుండి అనంతపురం వరకు ప్రతి రోజు లైన్ మాఫియాతో పోరాడుతూనే ఉన్న. మా కార్యకర్త భాగా పని చేశాడని ఫోన్లు చేస్తున్నారు. భాగా పని చేస్తే దేవుడి ఆస్తులు ఇచ్చేయాలా అవన్నీ నా దగ్గర కుదరవు. దేవుడి ఆస్తులను నీ చేతిలో పెడుతున్నాను, ఎన్ని ఒత్తిళ్ల వచ్చినా కాపాడాల్సిన బాధ్యత నీపై ఉందని చంద్రబాబు అన్నారు. దేవుడే దిగివచ్చి దేవుడి ఆస్తులు ఎవరికన్నా ఇవ్వమన్నా నేను ఇవ్వను. నాటర్మ్ అయిన తర్వాతే వక్ఫ్ దొంగలకు వక్ఫ్ బ్లాక్ మెయిలర్లకు వక్ఫ్ రియాల్టర్లకు పండుగ. నేనుండగా పండుగ ఉండదు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్త మృతికి సంతాపం తెలిపిన నేతలు

**వరికుంటపాడు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని వేంపాడు పంచాయతీ వెంగమాంబపురం ఎస్సీ కాలనీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త మెడబలిమి వెంకటగిరి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, విషయం తెలుసుకున్న మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు, మాజీ మండల కన్వీనర్ చంద్రా వెంకయ్య, మండల వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, సొసైటీ డైరక్టర్ మానం కొండలరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తెలుగుదేశం మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు రూ.5వేలు, మాజీ కన్వీనర్ చంద్రా వెంకయ్య రూ.5వేలు, సొసైటీ డైరక్టర్ మానం కొండలరావు రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. వెంకటగిరి కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా నాయకత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాతపూడి లాభాన్, నూతలపాటి బాల వెంగయ్య, నూతలపాటి వెంకట నారాయణ, చేవూరి సుకుమార్, షేక్ మాలకొండరాయుడు, బసవయ్య, భాస్కర్, శ్రీను, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా అమ్మకానికి అనుమతులు తప్పనిసరి



**వరికుంటపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** మండలంలో అనుమతులు లేకుండా బాణసంచా అమ్మితే కఠిన చర్యలు తప్పవని వరికుంటపాడు ఎస్సై రఘునాథ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పాత్రికేయులతో ఎస్సై రఘునాథ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు వరికుంటపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని వ్యాపారస్తులు పోలీసు, రెవెన్యూ అగ్నిమాపక శాఖల అనుమతులు పొందిన తర్వాతే బాణసంచా అమ్మకాలు చేపట్టాలని, అనుమతులు పొందిన షాపులు జనసంచారం తక్కువగా ఉండే విశాలమైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు నివారించేందుకు ప్రతి దుకాణం వద్ద నీటి డ్రమ్ములు, పొడి ఇసుక, అగ్ని మాపక పరికరాలు ఉంచుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించిన, నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కాబట్టి తప్పక అనుమతులు పొందాలని సూచించారు. అలాగే బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

## వింజమూరు వాసి స్రవంతికి డాక్టరేట్



**వింజమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని యర్రాబల్లిపాలెంలోని గోదల దశరామిరెడ్డి, పద్మావతి దంపతుల కుమార్తె గోదల స్రవంతికి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సైబర్ సెక్యూరిటీ అనే అంశం మీద డాక్టరేట్ పట్టా పొందారు. మోహన్‌బాబు యూనివర్సిటీ డాక్టర్ ఎం.సునీల్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా స్రవంతి భర్త మధుసూదన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, వాసు రెడ్డి, మద్దూరు గోపాల్‌రెడ్డి, మిడదల రాజారెడ్డి, గణపం పెద్ద మాలకొండరెడ్డి, గ్రామ పెద్దలు స్రవంతికి అభినందనలు తెలియజేశారు. ఈమె ఈ డాక్టరేట్ పట్టా పొందేందుకు భర్త మధుసూదన్‌రెడ్డి ప్రోత్సాహం ఎంతో ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ను సందర్శించిన జాతీయ మానవహక్కుల కమిషన్



**బిట్రగుంట, అక్టోబర్14, ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ లోని కడనూ తల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను జాతీయ మానవహక్కుల కమిషన్ మంగళవారం సందర్శిం చింది. ఈ సందర్భంగా జాతీయ మానవహక్కుల కమిషన్ విచారణ బృందానికి చెందిన కుల్బీర్ సింగ్,యతి ప్రకాష్‌శర్మ, సంజయ్ కుమార్ బృందంలోని సభ్యులు ఇంజనీరింగ్ కళాశాల వసతిగృహలకి సంబందించిన మురుగునీటి పారుదల విషయంలో తలెత్తిన వివాదాస్పద ప్రాంతాన్ని పరిశీలన చేశారు. ఇటీవల కళాశాల వసతి గృహానికి సంబందించిన మురు గునీటి పారుదల వ్యవహారం లో తలెత్తిన అసౌకర్యం ను కళాశాల యాజమాన్యం జాతీయ మానవహక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విచారణ నిర్వహించారు. కళాశాల పరిసరాలను పరిశీలన చేసినతరువాత, కళాశాల కరస్పాండెంట్ మాజీ శాసన సభ్యులురామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులుతోకూడ మాట్లాడి వారి అభిప్రాయాలుతెలుసుకున్నారు.వారివెంట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, కావలి గ్రామీణ సిఐపాపారావు, డిప్యూటీ తహసీల్దార్ భరత్ కుమార్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

## స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తి స్థాయిలో స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజల సహకారం అవసరమని డీఎల్‌పీవో డాక్టర్ పి. రమణయ్య అన్నారు. కోవూరు మండలం మోడేగుంట గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మాట్లా డుతూ ప్రజలు చెత్తాచె దారాలను ఎక్కడంటే అక్కడ పడవే యకుండా మీ ఇంటి దగ్గరకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. వాటి ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రాల్లో రైతు లకు ఉపయోగపడే ఎరువులను తయారు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పంచాయతీకి చెల్లిం చాల్సిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరిం చాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

## హనుమంతుడిని ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** భక్తుడు అనగానే హనుమంతుడే నిజమైన భక్తుడు అని ఆ మహనీయుని ఆదర్శం చూసి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని శ్రీ శివానందగిరి మాతాజీ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో శ్రీ శివానందగిరి మాతాజీ ఆధ్వర్యంలో రామాయణ మహా కావ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హనుమంతుని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. రామనామములు నిరంతరం స్మరణ చేస్తూ హనుమంతుడు రామునిపై తనకున్న భక్తిభావాన్ని చాటుకున్నారన్నారు. ప్రధానంగా ప్రతి ఒక్కరిలో మనస్సు చాలా ముఖ్యమైనదని, దానిని మన ఆధీనంలో ఉంచుకొనుటకు సాధన అవసరమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థ స్వామి, పలు విషయాలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ తీర్థ స్వామీజీ, శ్రీ రామకృష్ణ తీర్థ స్వామీజీ, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## మసీదు కాలనీలో పరిశుభ్రత కార్యక్రమం



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం ఆనేమడుగు పంచాయతీ మసీదు కాలనీలో సైడ్ కాలువలో మురుగు, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు రామిశెట్టి గుంట నుండి మన్న ఒగిదిన్నె చెరువుకు వెళ్లాల్సిన నీరు కాలనీలో ఆగిపోవడ ంతో, కాలువల్లోని మురికినీరు ఇళ్లలోకి చేరి, గ్రామ ప్రజల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు నన్నె షహెబ్ (బాబు) తెలిపారు. ఈ సమస్య పై కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సైడ్ కాలువ పూడికతీయడం, జెసిబి సహాయంతో మురికికుప్పలు, చెత్త, చెట్లను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. అనంతరం ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యగా చెత్త వేసుకోవడానికి వరలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనేమడుగు పంచాయతీ అధ్యక్షుడు గుడిపల్లి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు కోణంకి రమణయ్య, ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు, కోశాధికారి వేణుబాకం వెంకటేశ్వర్లు రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీల ఆదాయాన్ని పెంపుదల చేసేలా దృష్టి పెట్టాలి






**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆదాయాన్ని ఘననీయంగా పెంచేలా సంబంధిత పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీల ఆదాయాన్ని పెంపుదల చేసే అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఇంటి పన్నులు, కుళాయి పన్నులను సకాలంలో వసూలు చేయడమే కాకుండా పంచాయతీకి సంబంధించిన ఆస్తులను గుర్తించి వాటి ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపుదల చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలన్నారు. గ్రామాల్లో ఉన్న పంచాయతీ స్థలాల్లో చేపల గుంటలు, ఇతర వ్యాపార అవసరాల కొరకు వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను మరింతగా అభివృద్ధి చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గతంలో ఎప్పుడో ఇంటి పన్నులు వేయడం జరిగిందని, తర్వాత కాలంలో ఆ ఇళ్లపై ఒకటి లేదా రెండు అంతస్తులు నిర్మాణాలు చేసుకోవడం జరిగిందన్నారు. అటువంటి వాటిని గుర్తించి వాటికి కూడా ప్రభుత్వపరంగా పన్నులు వేసేలా దృష్టి పెడితే పంచాయతీ ఆదాయాలను పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వీడియో ప్రజెంటేషన్ ద్వారా పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. అంతకుముందు మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## ఆత్మ నిర్భర్ భారత్ కార్యాశాల నిర్వహించిన బిజెపి కావలి పట్టణ శాఖ



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకటవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆత్మ నిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి భారత్) పట్టణ కార్యాశాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు పట్టణంలోని ప్రతి వార్డులో స్వదేశీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి పౌరుడు స్వదేశీ వస్తువుల కొనుగోలుకు సిద్ధమయ్యాలా చూడాలని కోరారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి మేకిన్ ఇండియా ఉత్పత్తులు వాడడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని తద్వారా భారత్ అభివృద్ధి చెంది ఇతర దేశాలపై ఆధారపడకుండా ముందుకు పోగలదని అన్నారు. ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ ఇది కేవలం నినాదం కాదు మన దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించే ఒక మంత్రం అని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తులను వినియోగిద్దాం , స్వయం సమృద్ధి భారత్ ను సాధిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేయడం జరిగిందని తెలిపారు. స్వదేశీ వస్తువులను వినియోగించడం వల్ల 2026 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం మూడో స్థానానికి వస్తుందని తెలిపారు. దిగుమతులపై ఆధారపడకుండా ఎగుమతులను ప్రోత్స హించేలా మనందరం స్వదేశీ వస్తువులు వాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్, అంచిపాక కమల, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాల్యాద్రి, పట్టణ ఉపాధ్యక్షులు సుందరశెట్టి సుజి, కోడూరు మురళీకృష్ణ, పసుపులేటి సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు మంగమూరి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో పునాది లాంటిదని, దీనిని పటిష్టంగా నిర్మించుకుంటే పై తరగతికి సునాయాసంగా వెళ్లే అవకాశం ఉంటుందని సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు అనా న్నరు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా యువజన సర్వీస్ విభాగం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పర్సనాలటీ డెవలప్‌మెంట్ కెరియర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఫలితాలు మీ వెంట పరుగులు తీస్తాయన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు క్రికెట్, కేబుల్ టీవీ , సినిమాలకు పరీక్షలు పూర్తయ్యే వరకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసింది మన భారతదేశమే అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల పట్ల కూడా దృష్టి సారిస్తే వాటి వలన దేహదారుద్యం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. పరీక్షల కోసం కాకుండా విజయం సాధించాలనే పట్టుదలతో చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షలంటే బెరుకుతనాన్ని విడనాడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంచి చెడు అనే విచక్షణ కలిగి ఉండి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి, సూపరింటెండెంట్ గయాజ్ పలు సూచనలు చేశారు.

## తొమ్మిది మంది పేకాట రాయుళ్లు అరెస్ట్



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ జి.రాజేశ్వర రావు ఉత్తర్వులు మేరకు కావలి రూరల్ ఎస్ ఐ.బాజిబాబు మరియు వారి సిబ్బందితో కలిసి మంగళవారం కావలి, ముసునూరు సమీపములో గల ఖాళీ ప్రదేశంలో కొంత మంది వ్యక్తులు లోపల బయట పేకాట ఆడుతుండగా వారి పై రైడ్ చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుండి18,400 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది. కావలి రూరల్ మండలం పరిధిలోని గ్రామాలలో పేకాట, కోడిపందాలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నచో వెంటనే తెలియపరచవలసినదిగా కోరుచున్నామని కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వర రావు తెలియజేశారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**రాపూరు, అక్టోబరు14 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని యంపీపీఎస్ నార్త్ పాఠశాలలోని విద్యార్థులకు రాపూరు కాపువీధికి చెందిన బండి రమేష్ రెడ్డి విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. మంగళవారం రమేష్ రెడ్డి తన కుటుంబసభ్యులతో కలసి పాఠశాలను సందర్శించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఆయన విద్యాసామాగ్రిని ఆయన బార్య,పిల్లలతో కలసి అందజేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోని పాఠశాలకు, తన సోంత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులను కోరారు. అనంతరం ఆయన కుమార్తె జాగృతి భరత నాట్య ప్రదర్శన నిర్వహించి విద్యార్థులను ఆనందపరిచింది. పాఠశాలప్రధానోపాధ్యాయురాలు ఎస్‌డి హసీనా విద్యార్థులకు విద్యాసా మాగ్రి అందజేసిన దాతలను అభినందించారు.

## జీవన ఎరువులపై రైతులు అవగాహన చేసుకోవాలి



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు జీవన ఎరువులపై కూడా పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆచార్య ఎంజీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతి సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి. సుమతి తెలిపారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో రైతులకు కృషీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జీవన ఎరువులపై అవగాహన కల్పించారు.మాట్లాడుతూ రైతులు పంటలు లేని సమయంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని ఆ ఫలితాల ఆధారంగా ఎరవులు వాడుకుంటే సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులను వాడకపోవడంతో పొలంలోని నేల జీవం కోల్పోయి క్రమేనా పంట ఉత్పాదక శక్తి క్షీణిస్తుందన్నారు. దీని వలన దిగుబడి ఖర్చు తగ్గి సాగు ఖర్చు అధికమవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు జీవన ఎరువులు వాడుకుని రసాయన ఎరువుల మోతాదును 25 శాతం తగ్గించుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనాలు వేయడం వలన భూ భౌతిక స్థితి దెబ్బతిని నేలసారం క్షీణిస్తుందన్నారు. ముఖ్యంగా భూమిలో రసాయనిక ఎరువులు , భాస్వర నిల్వలు పెరిగిపోయి మొక్కల్లో సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తాయన్నారు. నేలలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించేందుకు జీవన ఎరువులు ఉపయోగపడతాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. జీవన ఎరువులు వాడడం వలన 25 శాతం కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని, ఈ మేరకు రైతులు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కృషీ విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి. లలితా శివజ్యోతి , మండల వ్యవసాయాధికారిణి టి. రజని, కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కె. కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ డి. విజయ్‌కుమార్ నాయక్‌లు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీవన ఎరువుల వాడకంపై ప్రయోగాత్మకంపై అవగాహన కల్పించారు.

## అవుట్ సోర్సింగ్ టీచర్లకు జరిగిన అన్యాయం అమానుషం



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయం మానుషమని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కావలి పట్టణ విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, సామాజిక కార్యకర్త సి.శారద ఒక ప్రకటనలు మంగళవారం తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు మాట తప్పడం మడమ తిప్పడం అలవాటైన ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు1,143 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని దుంగల్లో త్రోసివేయడం జరిగిందని తెలియజేశారు. రెండురోజుల క్రితం డీఎస్సీ ద్వారా రెగ్యులర్ అయిన కొత్త ఉపాధ్యాయులు గిరిజన గురుకుల పాఠశాలల్లో చేరగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రోడ్డున పడ్డారన్నారు.రెగ్యులర్ టీచర్లు చేరేవిధానం ప్రక్రియ ప్రకారం జరిగినా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా చేయడం వల్ల 1,143 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉపాధిని కోల్పోయి భవిష్యత్ పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల ముందెచ్చిన హామీతో ఇందాకా ఆశలు పెట్టుకున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఇపుడు దిక్కుతోచని పరిస్థితిలోకి నెట్టివేయ బడ్డార న్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలియజేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ చేసిన సిఫార్సులను కూడా ప్రభుత్వం పట్టించుకో కపోవడం గమనార్హం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మరచి అవుట్ సోర్సింగ్ పోస్టులను డీఎస్సీలో చూపడంతో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందిన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పోరు బాట పట్టకముందే అవుట్ సోర్సింగ్ ఉపా ధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వారికి న్యాయం చేయాలని తెలియజేశారు.

## క్రమపద్ధతిలో యూరియా పంపిణీ

– రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు





**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియా వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎరువుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో యూరియా వాడుకునే రైతులకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు గుర్తింపు కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆ కార్డులో ఆ రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఒక ఎకరాకు మూడు బస్తాల యూరియా అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. డీలర్లు కూడా పూర్తిస్థాయిలో సహకరించి యూరియా వాడకంపై రైతుల్లో అవగాహన పెంచేలా చూడాలన్నారు. విచక్షణారహితంగా వీటిని వాడడం వలన ఒకె వైపు వాతావరణ కాలుష్యం ఏర్పడడమే కాకుండా మరో వైపు సాగు ఖర్చులుపెరిగి క్యాన్సర్ వంటి రోగాలకు కారణమవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు , పురుగుమందులు వాడుకునేలా రైతులు తగు చొరవ తీసుకోవా లన్నారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. డీలర్లు కూడా వచ్చిన యూరియా స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు స్టాక్ బోర్డులో కూడా నమోదు చేసి ఏ రోజు అమ్మకాలను ఆ రోజే నమోదు చేయాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాల కులు అనిత డీలర్లకు పలు సూచనలు చేశారు. ఐదు మండలాలకు సంబంధించిన డీలర్లు, వ్యవసా యాధికారులు పాల్గొన్నారు.

## పిల్లలు చిరుధాన్యాలు తినడం వలన ప్రయోజనాలు సూపర్వైజర్ సురేఖ



**విడవలూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** మండలంలోని ఐసిడిఎస్ ఊటుకూరు సెక్టారు పెద్దపాలెం అంగన్వాడి కేంద్రంలో ఎనిమిదవ రాష్ట్ర య పోషణ మాసం సందర్భంగా పౌష్టికాహార మాసోత్సవాలు సూపర్వైజర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయ ఆరోగ్యకరమైన వంటల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా చిరుధాన్యాలతో పిల్లలకు వంటలు చేసి తినిపించడం వలన పిల్లలకు మంచి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. అదేవిధంగా స్థానికంగా దొరికే ఉత్పత్తులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎం.లక్ష్మీ కుమారి, ఏ.కామాక్షమ్మ, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

## సొంతవనరులపై సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ



**కొడవలూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మం డలంలోని గ్రామపంచాయతీలు సొంత వనరులు సమకూర్చుకోవాలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పం చులకు, కార్యదర్శులకు ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్య ంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ పంచాయతీలకు ప్రభుత్వ నుండి వచ్చే నిధులు కాకుండా సొంత వనరుల ద్వారా నిధులు వచ్చే విధంగా ప్రణాలికలు తయారు చేసుకోవాలని సర్పంచులను కార్యదర్శులు కోరినట్లు తెలిపారు. అదేవి ధంగా పంచాయతీలో స్థలమును పార్కింగ్ రుసుములు, చాపల చెరువులు వేలం వేయడం, కూడలలో గదు లు కట్టి అద్దెలకు ఇవ్వడం తద్వారా ప్రాక్యత పుణ్యక్షేత్రంలయందు వాణిజ్య సదు పాయాలు కల్పించి అద్దెల కు ఇవ్వడం ద్వారా విధులు సమకూర్చుకోవాల్సిందిగా తెలియజేశారు. ట్రైనర్స్ మాస్టర్ శ్రీకాంత్,మోహన్ కృష్ణ ప్రభుత్వ విధి విధానాలను గురించి వివరించారు.సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సరికొత్త చరిత్రకు శ్రీకారం...

# సీఎం చంద్రబాబుతో సాకారం

**సీఎం చంద్రబాబు రాష్ట్రానికి ఇచ్చిన వరం గూగుల్**
**గూగుల్ రాకతో రాష్ట్రం ఏఐ హబ్‌గా ఎదుగుతుంది**
**యువతకు భారీగా ఉద్యోగావకాశాలు**
**రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చిన**
**సీఎం చంద్రబాబు గారికి ధన్యవాదాలు తెలిపిన ప్రశాంతమ్మ**



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** యువతకు ఉద్యోగ ఉపాధి అవ కాశాల కల్పనే ధ్యేయంగా ప్రపంచం గర్వించదగ్గ సంస్థ గూగుల్‌ను రాష్ట్రానికి తీసుకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికే దక్కిందని కోవూరు ఎమ్మె ల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, నారాలోకేష్ అహర్ని శలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువ స్తుం డటంపై ఆమె సంతోషంవ్యక్తంచేశారు. విశాఖకేంద్రంగా గూగుల్ అను బంధ సంస్థ రైడెన్ డేటాసెంటర్‌ను ఏర్పాటు చేసేలా ఎంవోయూకు దుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. యంగెస్ట్ స్టేట్‌గా ఉన్న నవ్యాంధ్రప్రదేశ్ హై ఎస్ట్ ఇన్వెస్ట్ మెంట్స్ స్టేట్‌గా నిలుస్తోందని స్పష్టం చేశారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సాధించడం ఇదే తొలిసారని అన్నారు. 12 నెలలు పాటు శ్రమించి నేషనల్ పాలసీల్లో కూడా మార్పులు చేయించి 2లక్షల మందికి ఉపాధి కల్పించేలా రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినంద నీయమన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రావడం టెక్ అభివృద్ధికి ఎలా గేమ్ చేంజర్ అయిందో, ఇప్పుడు కూడా గూగుల్ విశాఖకు రావడం రాష్ట్ర అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా మారనుందని ఆకాంక్షించారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి వస్తే దేశవ్యాప్తంగా అందరూ ప్రశంసిస్తుంటే.. వైసీపీ నేతలు స్వాగతిం చకుండా గూగుల్ క్లౌడ్ సంస్థకు భూములు ఇవ్వకుండా అడ్డుపడి ఆ సంస్థపై కూడా తప్పుడు ప్రచారం చేయ దం దుర్మా ర్గమన్నారు. ఈ గూగుల్ హబ్‌లోని ఏఐ టెక్నాలజీ ద్వారా గూగుల్ సెర్చ్, యూట్యూబ్, జీ మెయి ల్,యాడ్స్,క్లౌడ్ వంటి ఇతర గూగుల్ సేవలు విశాఖ నుంచే ప్రపంచానికి అందించబడతాయని పేర్కొన్నారు.

## నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కావలి పోస్టల్ డిపా ర్ట్మెంట్ లో దీర్ఘకాలం సేవలందించిన విశ్రాంత హెడ్ పోస్ట్ మాస్టర్ బోగిరి ప్రభాకర్ రావు సతీమణి స్వర్గీయ బోగిరి సరోజనమ్మ 78వ జయంతి సందర్భంగా మంగళవారం కా వలి మండలం ఆముదాలదిన్నె గిరిజన కాలనీలోని నిరు పేదలకు దుప్పట్లు,స్వీట్స్, ఫ్రూట్స్‌ని పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి బోగిరి సరోజనమ్మ కుమారుడు డి.ఎస్.పి బోగిరి మోజెస్‌పాల్ చేతులమీదగా ఈ కార్యక్రమం నిర్వహించడంజరిగింది. మద్దూరు పాడు మాజీ సర్పంచ్ ఆర్.బాలకృష్ణ, న్యాయవాది ఐ. సాయిప్రసాద్, లోకఅదలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన సామాజిక ప్రజా వేదిక



**వింజమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక లో పలు పంచాయతీల్లో పథకంలో జరిగిన పలు అవకతవ కలను గుర్తించి డ్వామా పీడీ గంగా భవాని 12 లక్షల 90 రూపాయలు రికవరీకి ఆదేశించారు. మం డలం లోని 12 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి 31 వరకు జరిగిన 12.72 కోట్లు పనులకు సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించి ఆయా పంచాయతీ పరిధిలోని నివేదికలను అందించారు. పంచాయతీలో చేసిన పనులలో జరిగినఅవకతవకలను ప్రజా వేదిక దృష్టికి తీసుకువచ్చారు. కొలతలలో తేడాలు ఉన్నాయని, అలాగే రవాణా భత్యం నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారని మస్టర్లలో పనికిరాని వారి పేర్లను వేశారని గుర్తుంచారు. ఏకిస్తీపురం 58922, బుక్కాపురం 9096, చాకలికొండ 40667, గుం డెమడకల 11809, జనార్ధనపురం 130174, కాటేపల్లి 160432, నల్లగొండ 82640, నం దిగుంట 330427, రాగిపాడు 132024, శంఖవరం 500, ఊటుకూరు 286436, వింజమూరు 53500, రికవ రీకి ఆదేశించారు.విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మీ ఏపీడీ మృదుల, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్, సోషల్ ఆడిట్ ఫ్రోగ్రాం మేనేజర్ ఈశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర యాదవ్, పీఆర్ ఏఈ తిరుమలయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఆర్‌పీ తిరుమలేష్, ఏపీవో శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు ఎఫ్ఎలో పాల్గొన్నారు.

## ప్రధాని,సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



**నెల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త – వైద్యం** ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణన, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్య టన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై న న్నూరు రాగమ యూరి గ్రీన్ హిల్స్ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ నందు మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మె ల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్ సభకు భారీగా జనం తరలివచ్చే అవకాశం ఉన్న క్రమంలో అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సరిపడా బస్సులు ఏర్పాటు, బస్సుల రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు వంటి అంశాలపై చర్చించాం. ట్రాఫిక్ సమస్యలు లేకుండా సభా వేదికకు ముందుగానే బస్సుల్లో ప్రజలు చేరుకునేలా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించడం జరిగింది.

# సూపర్ జీఎస్టీ

**- సూపర్ సేవింగ్స్ పై అవగాహన కల్పిస్తున్న చెంచల బాబు యాదవ్**
**- జీఎస్టీపై పన్ను మార్పులు తీసుకొచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ**
**- కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**
**- మాజీ జడ్పీ చైర్‌పర్సన్ చెంచల బాబుయాదవ్**



**ఉదయగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీపై విప్లవాత్మకమైన పెను మార్పులు తీసుకొని వచ్చి జీఎస్టీ వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని మాజీ జడ్పీ చైర్మన్ పెన్నబోయిన చెంచల బాబు యాదవ్ అన్నారు. మండల కేంద్రమైన ఉదయగిరిలో మండల కన్వీనర్ చింత నబోయిన బయన్న యాదవ్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంచల బాబు యాదవ్ మాట్లాడుతూ అనేక రకాలైన వస్తువుల పైన 20 శాతం ఉన్న జీఎస్టీని 15 శాతానికి తగ్గించి ప్రజలకు మేలు చేకూర్చినందుకు ప్రజలు హర్షంవ్యక్తం చేస్తున్నారని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం పడకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో మేలు చేకూర్చారని దాని వల్ల ప్రతి పేదవానికి చిరు వ్యాపారస్తులకు 5వేల నుంచి పది వేల రూపాయలు వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని అన్నారు. అంతే కాకుండా సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని అదే విధంగా సూపర్ జీఎస్టీ ద్వారా కూడా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అలాగే గత నాలుగు రోజుల నుంచి వైసీపీ నాయకులు కల్తీ మద్యం అని చెప్పి ఆందోళనలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, వైసీపీ నాయకులు కల్తీ మద్యంపై మాట్లాడే అర్హత లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో కల్తీ మద్యం అనేది రాష్ట్రంలో ఏరులై పారిందని అలాంటిది వారు ఇప్పుడు మాట్లాడటం ధర్నాలు నిర్వహించడం సిగ్గు చేటు అన్నారు. ఆనాడు మధ్యాహ్నం కి సరైన పేర్లు కూడా లేకుండా నకిలీ మద్యాన్ని అమ్మారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అనంతరం మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న యాదవ్ మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీలలో ఉన్నటువంటి బూత్ ఇన్‌చార్జీలు నాయకులు, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు షేక్ రియాజ్, బొజ్జ నరసింహులు, కుమ్మిత రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, నల్లిపోగు నరసింహులు, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో ఘనంగా కాత్యాయని వ్రతం



**నెల్లూరు, అక్టోబరు 14 ప్రభాతవాత – విద్య** నగరంలోని స్థానిక దర్గామిట్టలో వెలసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం (అష్టమి) కాత్యాయని వ్రతము అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు,విశేష పూజలు ,మంగళవారం మధ్యాహ్నం రాహుకాల దీపాలు, పూలంగి సేవ లని గావించారు. ఈ వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు . కాగా ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి పర్యవేక్షించి ఎటువంటి ఇబందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు . ఈ కార్యక్రమంలో అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బకింగ్ కెనాల్‌కు మహర్దశ ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు



**విడవలూరు, అక్టోబర్ 14ప్రభాత వార్త:** మండలంలోని పెద్దపాలెం పంచాయతీ గ్రామ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లాలంటే బకింగ్ కెనాల్ ద్వారా వెళ్లాలి అధి పూర్తిగా పుడిపోవడంతో కొన్ని సంవత్సరాలనుండి మత్స్యకారు లు వేట కు వెళ్లడానికి అనేక ఇబ్బం దు లు ఎదుర్కోవడం జరుగుతుందని టిడిపి మత్స్యకార యువ నాయకులు మీనంగారి బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు జీవన ఉపాధి కల్పించే సము ద్రతీరం కు వెళ్లే కెనాల్ దారి ఏర్పాటుకు గ్రామ కాపులతో సమస్యపై చర్చించుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడడం జరిగిందన్నారు. సముద్రంలోకి వెళ్లాలంటే కెనాల్ ద్వా రానే వెళ్లాలి 50 మీటర్లు పుడిన పూడిక తొలగిస్తే గాని దారి ఏర్పడుతుందని ఎమ్మెల్యే ముందు మత్స్యకారులు తెలుపగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కెనాల్ పూడిక పనుల కోసం ఆమె సొంత నిధులతో వి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా పూడికతీత మిషన్ ని ఏర్పాటు చేశారు.అంతేకాకుండా గ్రామంలో స్మశాన వాటికకు, సముద్ర తీరం వరకు రోడ్డు చేయడం జరిగిందని వెల్లడించారు. అనంతరం మేకల పోల య్య, పెద్ద కాపు చిరంజీవి మాట్లాడుతూ మత్స్యకారులకు ఏదైనా సమస్య ఉంది అని తెలుపగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్యను పరిష్కారం చేయడం జరుగు తుంది. ఇలాంటి ఎమ్మెల్యేను మరువలేమని ఆమెకు మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీనంగారు తిరుపతయ్య,కాపులు అక్కయాగారి నరసింహ,శ్రీహరికోట నాగభూషన్,ముక్కంటీ తాతయ్య, కొండూరు వెంకటేశ్వర్లు,సున్నపు పాపారావు,ఆడారుగారి రోశయ్య,అక్కయాగారి పోలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిబంధనలకు లోబడి బాణాసంచా అమ్మకాలు జరపాలి - సిఐ రవి నాయక్



**ముత్తుకూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** నిబంధనలకు లోబడి బాణాసంచా అమ్మకాలు జరపాలని సిఐ రవి నాయక్, కృష్ణప ట్నం పోర్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సం దర్భంగా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సిఐ రవి నాయక్, కృష్ణపట్నం పోర్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డిలు మండల ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిర్దేశించిన నిబంధనాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే వారి మీద కేసులు కూడా నమోదు చేస్తామని టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేటప్పుడు దానికి సంబంధించి నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాము నిర్దేశించిన అమ్మకపు దారుల నుంచి మాత్రమే ప్రజలు టపాకాయలు కొనుగోలు చేయాలని లైసెన్సులు లేని అమ్మకపు దారుల నుంచి టపాకాయలు కొనుగోలు చేయరాదన్నారు. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దవారి పర్యవేక్షణలో మాత్రమే బాణసంచా కాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని దగ్గరలో నీటిని అందుబాటులో ఉంచుకొని బాణ సంచా కాల్చాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

## సిట్ విచారణ కాదు సిబిఐ విచారణ చేపట్టాలి




**ఆత్మకూరు, అక్టోబరు14,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామ గ్రామాన మద్యం దుకాణాలు, వీధివీధికో బెల్టుషాపులు మద్యం ఏరులై పారుతుందని దీంతోపాటు నకిలి మద్యం తయారు చేసి విక్రయిస్తు ప్రజలను బలిగొంటుందని వైఎస్ఆర్‌సిపి నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న టిడిపి నేతల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సిపి అది నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో మంగళవారం నియోజకవర్గంలోని వైసిపి నాయకులు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి ఆధ్వర్యంలో నకిలీ మద్యం ఒక కుటీర పరిశ్రమగా తయారు చేశారన్నారు. మద్యంప్రియుల ఆరోగ్యానికి తూట్లు పొడిచేలా మంచినీటికంటే ఎక్కువగా మద్యాన్ని పారించేలా చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లో బెల్ట్‌షాపులు పుట్టగొ దు గుల్లా ఎక్కడికక్కడే ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిట్ విచారణకు ఆదేశిం చామని చెప్పారని అయితే సిట్ విచారణ కాదు సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతా ప్‌రెడ్డి, , బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటే శ్వర్లు, మండల కన్వీనర్లు పులగం శంకర్‌రెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమి రమేష్‌రెడ్డి, బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు దేవసహాయం, కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, నియోజకవర్గ వైసిపి నాయకులు ఇందూరు సురేంద్రరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఆంద్రా సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రోశిరెడ్డి, కల్పనారెడ్డి, ఫణికుమార్‌రెడ్డి , సూరి మదన్‌మోహన్‌రెడ్డి, బొడ్డు గిరిబాబు, బత్తిన నారాయణ, నందవరం ప్రసాద్, మునీర్, జమ్ము, మీరామొహిద్దీన్, మస్తానయ్య, సుబ్బారెడ్డి, రహీం, బొలిగర్ల వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులురెడ్డి, నందవరం ప్రతాప్, కొండలరావ్, హరిబాబు, బాబులురెడ్డి, బాల చెన్నయ్య, జహీంగర్, అక్రమ్, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అభినందనలు



**వింజమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రక టించిన డీఎస్సీ మెరిట్ జాబితా ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులు మంగళవారం ఎంఈఓ-1 పోలుబోయిన రమేష్, ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మెగా డీఎస్సీ-2025 ద్వారా ఉపాధ్యాయ పోస్టులు నియామకాలలో వింజమూరు మండలానికి 15 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు కేటాయించబడ్డారని, అందులో ఆర్‌కే ఉన్నత పాఠశాలకు ఐదు మంది, వింజమూరు బాలుర ఉన్నత పాఠశాలకు 5 మంది, గుండెమడగల ఉన్నత పాఠశాలకు ఇద్దరు, కాటేపల్లి ఉన్నతపాఠశాలకు ఒకరు, గుండెమడగల ప్రాథమిక పాఠశాలకు ఒకరు, వింజమూరు బాలికోన్నత పాఠశాలకు ఒకరు, గుండెమండలం మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ఒకరు వంతున కేటాయించబడ్డారని తెలిపారు. నూతనంగా విధులు చేపట్టిన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా వారికి బంగారు బాట వేయాలని ఆ విధంగా మీరు బోధన చేయాలని ఆయన ఆ ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ సిబ్బంది జలీలు, మౌనిక, శ్రీహరి ఉన్నారు.

## సేవా తత్పరుడు కలికి శ్రీహరి రెడ్డికి ఘనసత్కారం

**కావలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** సేవా తత్పరుడు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ టైం సభ్యులు , సంఘ సేవకులు కలికి శ్రీహరి రెడ్డి నెల్లూరు రెడ్ క్రాస్ క్యాన్సర్ వైద్యశాల కోఆర్డినేటర్ గా బాధ్యతలు చేప ట్టిన సందర్భంగా మంగళవారం కాల్ రెడ్ క్రాస్ భవనము నందు పలువురు ప్రముఖులు ఆయనను దృశ్యాలు వాళ్ళతో పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నెల్లూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు ఉదయం 10.30గంటలకు జరగనుంది. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో ఎంవీ రమణమ్మ తెలియజేశారు.

## సంగం నేషనల్ హైవే 67పై ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు



**సంగం అక్టోబర్ 14 ప్రభాతవార్త** సంగం నేషనల్ హైవే 67పై ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలలో భాగంగా,అలాగే వాహనాలు వేగ నియంత్రణ కొరకై జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు సంగం సిఐ వేమారెడ్డి స్పీడ్ గన్‌ను ఉపయోగించి రోడ్డుపై అతి వేగంగా నడిపే వాహనాలపై ఫైన్లు విధండం జరిగింది.ఈ హైవేపై 80 స్పీడు మాత్రమే వేగంగా నిర్ణయించబడిందని ఆయన తెలి పారు. నిర్ణత ప్రదేశాలలో సూచిక బోర్డులను గమనించి 30,60,80 గా ఉన్నటువంటి స్పీడు బోర్డులను గమనిస్తు తమ వాహనాలలో జాగ్రత్తగా హైవేపై ప్రయాణిస్తారని ప్రజలను కోరుకుంటున్నామని అన్నారు, రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా హెల్మెట్,అవేర్నెస్ ర్యాలీలు అలాగే నూతన టెక్నాలజి అయినటువంటి స్పీడ్ గన్ ఉపయోగిస్తామని ప్రజలకు తెలియ చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలను పోలీస్ నిబంధనలకు అణుగుణంగా నడిపి గమ్య స్దానానికి సురక్షితంగా తీసుకొని వెళ్ళాలని సిఐ సూచించారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ సిబ్బంది ఉన్నారు.

## గూగుల్ క్లౌడ్ సంస్థ రాక రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మైలురాయి : ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 14,ప్రభాతవార:** రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి గూగుల్ క్లౌడ్ సంస్థ రాక మైలురాయిగా నిలుస్తుందని కావలి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సర్వతోము ఖాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. గత 12 నెలలుగా లోకేష్ చేసిన కృషి ఫలితంగా 1.33 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పాటు 2 లక్షల ఉద్యోగాలను సృష్టించే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడం చారిత్రాత్మక విజయం అని అన్నారు. దేశంలోనే తొలిసారి 15 బిలియన్ డాలర్ల ఎఫ్ఐ పెట్టుబడులు సాధించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రాక టెక్ రంగానికి గేమ్ చేంజర్‌గా మారినట్లే, విశాఖలో గూగుల్ క్లౌడ్ రాక రాష్ట్ర భవిష్యత్తు రూపురేఖలను మార్చబోతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణను మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతిపెద్ద ఏఐ హబ్, డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. దీని ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యవసాయం,వైద్యం, విద్య రంగాలు బలోపేతం అవుతాయన్నారు. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ వేగం పెరిగి, విశాఖ అంతర్జాతీయ డిజిటల్ కనెక్టివిటీ హబ్‌గా మారనుందని చెప్పారు. ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపుచూస్తున్న వేళ, వైసీపీనేతలు ఈ అభివృద్ధికి అడ్డుపడి, గూగుల్ సంస్థకు భూములు ఇవ్వకుండా తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం అని ఎమ్మెల్యే విమర్శించారు. గూగుల్ ఏఐ హబ్ రాకతో విశాఖ సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి సిటీ ఆఫ్ డిజిటల్ డెస్టినీగా మారనుందని, ఈ ఒప్పందం రాష్ట్ర భవిష్యత్తుకు గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపుదాడులు ప్రొక్లెయిన్, టిప్పర్లు సీజ్



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ఒక వైపు జిల్లా అధికారులు అక్టోబర్ 15వ తేది వరకు పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తరలించ కూడదని స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే ఇసుకను అక్రమంగా తరలించే మాఫియా మాత్రం వాటిని పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా రవాణా చేస్తూనే ఉన్నారు. ఫలితంగా పెన్నానది పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటికి ఇబ్బంది పడే పరిస్థితి వస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి జమ్మిపాలెంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ప్రొక్లెయిన్ ద్వారా టిప్పర్లు ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్ గౌడ్‌లు మెరుపుదాడులు చేశారు.అక్రమ రవాణా చేస్తున్న ప్రొక్లెయిన్, టిప్పర్లు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మాఫియాలో ఆందోళన బయలు దేరింది.

## అక్రమ మద్యం నిల్వ ఉంటే సమాచారం ఇవ్వండి



**కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వ ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు. కోవూరులోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా అనధికారికంగా మద్యం షాపులు నిర్వహిస్తుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు అక్రమంగా మద్యం నిల్వలు కలిగి ఉన్న వారిపై దాడులు చేసి 93 కేసులను ఇప్పటివరకు పెట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎక్కడైనా అక్రమం గా గంజాయి నిల్వలు ఉన్నా గంజాయి అమ్ముతున్నా అటువంటి సమాచారం కూడా తమకు అందిం చాల న్నారు. గత సంవత్సరం రోజులుగా 93 బెల్టుషాపులపై కేసులు, బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై 55 కేసులు, 61 బైండోవర్ కేసులు, ఒక గంజాయి కేసు ఇప్పటివరకు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్రమ మద్యం సమాచారంపై ఎవరైనా సమాచారం ఇస్తే అటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. 9440902524 అనే నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## రీ సర్వే గ్రామ సభలు సద్వినియోగం




**వేగూరు కోవూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీలో భూము లకు సంబంధించి రీ సర్వే పూర్తికావడం జరిగిందని, దానికి సంబంధించి రైతులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే గ్రామ సభలో వాటిని పరిష్కరించుకునేలా రైతులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం రీ సర్వేకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి సంబంధించి రీ సర్వే పూర్తి చేసి ముసాయిదా కూడా గ్రామ పంచాయతీలోనూ, ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోనూ నోటీసు బోర్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రీ సర్వేలో రైతులకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సకాలంలో పరిష్కరించేలా తగు చొరవ తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరావతి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్ గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు, రైతులు ఉన్నారు.

## రావూస్ కళాశాలని పరిశీలించిన అర్ఐఓ వరప్రసాద్



**నెల్లూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త –విద్య** నగరంలోని స్థానిక రావూస్ జానియర్ కళాశాలని మంగళ వా రం ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (అర్ఐఓ) వరప్రసాద్ పరిశీలించారు . ఇందులో బాగంగా కళాశాలతో విద్యాబోధన , విద్యార్థులకి అందిస్తున్న సదుపాయాలు, వసూలు చేస్తున ఫీజుల వివరాలని అడిగి తెలుసుకున్నారు.అలాగె తరగతి గదులు, లాబరేటరీలని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అర్ఐఓ మాట్లడుతూ జిల్లాలోని ప్రైవేటు జానియర్ కళాశాలల నిర్వహకులు బోర్డ్ నిబంధలని పతిచాలని సూచించారు. అలాగె నిబంధనల్ని పాటించని కళాశాలల గుర్తింపు రద్దుచేస్తామని హేచ్చటించారు . ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సిబంధి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ఆత్మకూరు,అక్టోబరు14,ప్రభాతవార్త :** ఆత్మకూరులో పేకాట స్థావరంపై ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐలు జిలానీ, శ్రీనివాసులురెడ్డిలు ఇతర సిబ్బందితో కలిసి మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుమందిని అదుపులోకి తీసుకొని వారి నుండి 5సెల్‌ఫోన్లు, 4బైకులు, 41,500రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్సీ అజిత్ ఆదేశాలతో డియస్సీ కె.వేణుగోపాల్ సూచనలతో తాము తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించిపేకాట, ఇతరఅసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారిపైకేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పేకాట రాయుళ్ళపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.